# మన పంచాంగములలో 'కల్యబ్దముల' గణనలో వస్తున్న పొరబాటు!

మన దేశంలో దాదాపు మన పంచాంగకర్త లందరూ వారి వారి పంచాంగములలో 'ఖరనామ' సంవత్సరమును కల్యబ్ది 5112 అని ఇస్తున్న విషయం అందరకు తెలిసిందే. కలియుగారంభం ప్రమాది సం॥ చైత్రశుద్ధ పాడ్యమి నుండి లెక్కించిన నేడు జరుగుచున్న 'ఖర' నామ సంవత్సరము 5113 కలియుగాబ్దమవుతుందేగాని 5112 సం॥ కానేరదు. 5112 అనిన మరల వికృతి సంవత్సరమే అవుతుంది.



నేడు మన పంచాంగకర్తలిస్తున్నట్లు కల్యాది 'ఖర' సంవత్సరమునకు 5112 సంవత్సరములనే అనుకుందాము. కలియుగమారంభించిన "ప్రమాది సం॥ 'బహుధాన్య'తో అంతమయ్యే 60 (అరువది) సంవత్సర సంఖ్యతో నేడు ఇస్తున్న కలి 5112 సంవత్సరములను భాగించిన అది ఎనుబది అయిదుమార్లు పోగా (అనగా 5100సం॥) 12 సం॥ శేషం మిగులుతుంది. ఆ మిగిలిన శేష సంవత్సరములను 'ప్రమాది' నుండి లెక్కించుకుంటే అది 'వికృతి' అవుతుందేగాని 'ఖర' సంవత్సరముకానే రదు. ఖరనామ సంవత్సరము ప్రమాది నుండి లెక్కించిన అది 13వది అవుతుంది. దీనికి వేరే నిదర్శనములు అక్కరలేదు. ఇందుకు కారణం కలి యుగాబ్ది గణనలో ఇటీవలికాలంలో సంఖ్యనిచ్చుటలో వచ్చిన పొరబాటైయుండవచ్చును.

భారతయుద్ధము జరిగిన పిమ్మట 36 సంవత్సరములకు శ్రీకృష్ణ నిర్యాణము జరిగింది. ఆ క్షణం నుండే కలియుగమారంభించబడింది. ఆనాడు చైత్రశుద్ధ పాడ్యమి. ఆ సమయంలో గ్రహకూటమి సంభవించినది. శన్యాది గ్రహాలన్నీ మేషరాశిలో చేరియున్నాయి. సప్తర్షి మండలం మఖానక్షత్రములో 3 పాదములు గడపి నాల్గవపాదంలో ప్రవేశించింది. ఆ విషయం మన పురాణ సిద్ధాంతాది గ్రంథములు చెప్పియున్నాయి. ఆ సమయం క్రీ.పూ.3102 సం. అయి వుంది. ఈ విషయం మన దేశ, విదేశీయ ప్రముఖ జ్యోతిష, ఖగోళ శాస్త్రజ్ఞులు, ప్రముఖ చరిత్రకారులందరూ అంగీకరించియేయున్నారు.

ఆనాటి నుండి నేటికి అనగా ఈ ఖరనామ సంవత్సరమునకు కల్యాబ్దములు 5113 అవుతాయి. మరియు క్రీ.పూ. 3102 కలియుగారంభం క్రీస్తు శకారంభమునకు 3102 సంవత్సరములు, క్రీ.శకములో నేటి "ఖర" 2011సం॥లు కలిపిన నేటికి కల్యబ్దము 5113 సం॥ "ఖర నామ సంవత్సరం అవుతుంది.

కనుక పై విషయములను గమనించి రాబోవు 'నందన' సంవత్సరమునకు కల్యబ్దమును 5114గా ఇచ్చి ఇకపై సంవత్సరములను క్రమాభివృద్ధిగా ఇస్తూ ఆయా సంవత్సరముల పేర్లను, కల్యాబ్దములను సరిగా పేర్కొనవలసినదిగా మన ఖగోళ, జ్యోతిశ్శాస్త్ర జ్ఞులను, పంచాంగకర్తలను కోరుచున్నాను.

– డా॥ కోటనిత్యానందశాస్త్రి, విజయవాడ